
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 15 । జూన్ । 2024



సోమశిలలో 8.634 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 8.634 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయానికి 1,850 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రా)	రూ.73,930
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.6,639
3 శాతం జీఎస్టీతో	రూ.6,838
నవర (8 గ్రా)	రూ.54,704

గరిష్టం/కనిష్టం
37.1 /29.0

వాతావరణం

వాతావరణంలో తేమ 50 శాతం ఉంది. జిల్లాలో శనివారం అక్కడక్కడ ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

19, 20 తేదీల్లో జిల్లాలో కేంద్ర బృందం పర్యటన

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర ప్రభుత్వం గత రబీ వ్యవసాయ సీజన్‌కు సంబంధించి ఆరు జిల్లాలను కరువు జిల్లాలుగా ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో కరువు పరిస్థితిని అంచనా వేయడానికి ఈ నెల 19, 20 తేదీల్లో ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం పర్యటించనున్నట్లు కలెక్టర్ ఎం.హరినారాయణన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర పశు సంవర్ధక, డెయిరీ శాఖ డైరెక్టర్ సందీప్‌శర్మ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు మన్ను జీ ఉపాధ్యాయ్, మదన్‌మోహన్ మౌర్యతో కూడిన కేంద్ర బృందం జిల్లాలో కరువు పరిస్థితిని అంచనా వేయనున్నట్లు కలెక్టర్ చెప్పారు. జిల్లాలో కేంద్ర బృందం పర్యటనకు అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయాలని, కరువు నష్టాన్ని వివరించేలా ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు, పవర్ పాయింట్ ప్రజెంటేషన్, కేంద్ర బృందం పరిశీలించే ప్రాంతాలకు సంబంధించి రూట్ మ్యాప్‌లు సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

20న ఐఐహెచ్‌టీలో స్పాట్ అడ్మిషన్లు

నెల్లూరు(దర్గామిట్ట): తిరుపతి జిల్లా వెంకటగిరిలోని శ్రీ ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ కళాశాలలో మూడేళ్ల డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 20న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి వరప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ టెక్నాలజీలో మూడేళ్ల పాటు శిక్షణ ఇచ్చి కేంద్ర ప్రభుత్వ జౌళిశాఖ సర్టిఫికెట్లు జారీ చేస్తామన్నారు. 10వ తరగతి పాసైన అభ్యర్థుల మార్కుల మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని, ఈ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు చేనేత, జౌళి శాఖకు సంబంధించిన ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగావకాశాలు మెండుగా లభిస్తాయన్నారు. ఈ కోర్సులో చేరిన విద్యార్థులకు ఉపకారం వేతనం ఇవ్వనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ ఐఐహెచ్‌టీవీజీఆర్.కామ్‌ను సందర్శించాలన్నారు. మరింత సమాచారం కోసం విద్యార్థులు అన్ని సర్టిఫికెట్లతో ఈ నెల 20న నేరుగా కళాశాలకు హాజరుకావాలని జిల్లా చేనేత, జౌళీశాఖ అధికారి వరప్రసాద్ సూచించారు.

ఏపీ రోడ్ కార్పొరేషన్ డైరెక్టర్ రాజీనామా



నలగర్ల భారతి

వెంకటాచలం: ఏపీ రాష్ట్ర రోడ్ కార్పొరేషన్ డైరెక్టర్ నలగర్ల భారతి తన పదవికి గురువారం రాజీనామా చేసినట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తిక్కవరప్పాడు మాజీ ఎంపీటీసీ నలగర్ల భారతిని ఏపీ రోడ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమి చెందడంతో నలగర్ల భారతి తన పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు.

17న సబ్‌జూనియర్స్, జూనియర్స్ ఫుట్‌బాల్ జట్ల ఎంపికలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఈ నెల 17వ తేదీన సాయంత్రం 3 గంటలకు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జిల్లా సబ్ జూనియర్స్ బాలబాలికల, జూనియర్స్ బాలికల జట్ల ఎంపికలు జరుగనున్నాయని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బి.చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆదేశాల మేరకు ఎంపికైన జిల్లా జట్లు ఈ నెల 21న నెల్లూరులో తిరుపతి, చిత్తూరు, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాల పరిధిలో జోనల్ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటాయన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు తమ వయస్సు ధ్రువీకరణ, ఒరిజినల్ ఆధార్ కార్డులతో సంప్రదించాలన్నారు.

ఉపాధ్యాయుల ఖాళీలకు దరఖాస్తు చేసుకోండి

ఆత్మకూరు: పట్టణంలోని ఏపీ బాలికల గురుకుల పాఠశాలలో పలు ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయని, అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ టి.కామేశ్వరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకొనేందుకు గతంలో విధించిన గడువును ఈ నెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు ఆమె తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి ఇంగ్లిష్ మీడియంలో బోధించేందుకు, ఇంగ్లిష్, హిందీ, ఫిజికల్ సైన్స్, సబ్జెక్టులు బోధించుటకు అర్హత కలిగిన మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 20 లోపు దరఖాస్తులను పాఠశాలలో అందజేయాలన్నారు. ఇంగ్లిష్‌లో టీజీటీ, పీజీటీ, ఫిజికల్ సైన్స్‌లో పీజీటీ, హిందీ బోధనకు టీజీటీ, పీజీటీ అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మెడిసిన్ మాఫియా

- జిల్లాలో 2 వేలకు పైగా మెడికల్ షాపులు
- ఇష్టారాజ్యంగా నిర్వహణ
- ఫార్మసిస్టులు లేని దుకాణాలే ఎక్కువ
- ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందుల విక్రయాలు
- విచ్చలవిడిగా యాంటీ బయాటిక్స్, పెయిన్ కిల్లర్స్ విక్రయం
- నెలవారీ మామూళ్లతో తనిఖీలకు స్వస్తి.. చర్యలకు నుస్తీ

జిల్లాలో మెడిసిన్ మాఫియా తయారైంది. మందుల దుకాణాలను ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నారు. దుకాణం నిర్వహించే వ్యక్తి ఫార్మసిస్ట్ అయి ఉండాలన్న నిబంధన ఎక్కడా అమలు కావడం లేదు. ఏమాత్రం అవగాహన లేని వారు మందులను విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. సంబంధిత అధికారులు దుకాణ యజమానులు ఇచ్చే నెలవారీ మామూళ్లు పుచ్చుకుంటూ తనిఖీలకు స్వస్తి చెప్పడం, చర్యలకు ముఖం చాటేయడంతో మందుల దుకాణదారులు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వైద్యులు ధ్రువీకరించిన మందుల చీటీ ఉంటేనే మందులు ఇవ్వాల్సి ఉండాలన్న నిబంధన కూడా ఎక్కడా అమలు కావడం లేదు.



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో మెడికల్ షాపులు.. ప్రొవిజన్ స్టోర్స్ మాదిరిగా విచ్చలవిడిగా ఏర్పాటవుతున్నాయి. కొద్ది రోజుల పాటు మెడికల్ షాపుల్లో పనిచేసి వారంతా సొంతంగా దుకాణాలు తెరుస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే దాదాపు 80 శాతం వరకు ఫార్మసిస్టులు లేని దుకాణాలే ఉన్నాయని తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 2020 మెడికల్ షాపులున్నాయి. ఇందులో హోల్‌సేల్ 432 కాగా, రిటైల్ దుకాణాలు 1,196 వరకు ఉన్నాయి. నెల్లూరులో 495 (ఆర్), 340 (హెచ్), కావలిలో 371 (ఆర్), 69 (హెచ్) దుకాణాలున్నాయి. ఇవికాక గ్రామాల్లో దాదాపు 700 మెడికల్ షాపులు రిటైల్ కాగా 92 హోల్‌సేల్ దుకాణాలు ఉన్నాయి. ఎక్కడైనా ఆస్పత్రి కొత్తగా ఏర్పాటు చేస్తున్నారంటే దానికి అనుసంధానంగా మందుల దుకాణం పెట్టడానికి పోటీ విపరీతంగా ఉంటుంది. జిల్లాలో కొన్ని మల్టీస్పెషాలిటీ ఆస్పత్రుల్లో మందుల దుకాణం ఏర్పాటుకు పోటీ దారులు లక్షల రూపాయలు గుడ్ విల్‌గా ఇచ్చేందుకు వెనకాడటం లేదు. మందుల దుకాణంలో వచ్చే ఆదాయం ఎక్కువగా ఉంటుండడంతో ఆ ఆస్పత్రుల వర్గాలే సొంతంగా మెడికల్ షాపులను ఏర్పాటు చేసుకుంటున్నాయి.



జిల్లాలో మందుల దుకాణాల నిర్వహణపై ఔషధ నియంత్రణ శాఖ సహాయక సంచాలకుడి పర్యవేక్షణతో పాటు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణ కూడా ఉంటుంది. అయితే వీరు నామమాత్రపు తనిఖీలు నిర్వహిస్తూ చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. జిల్లాలో ఈ ఏడాదిలో ఇంత వరకు ఒక్క కేసు కూడా నమోదు కాలేదంటే ఔషధ నియంత్రణ శాఖ పనితీరుకు అద్దం పడుతోంది. సంబంధిత

నామమాత్రపు తనిఖీలు

శాఖాధికారులు పూర్తిస్థాయిలో చిత్తశుద్ధితో విధులు నిర్వర్తిస్తే వందల కొద్ది కేసులు నమోదు చేసే అవకాశం ఉంటుంది. జిల్లా అధికారుల సరైన చర్యలు లేకపోవడంతో వారి ఇష్టారాజ్యంగా మారిందని ప్రజలు విమర్శిస్తున్నారు. మందుల దుకాణాలకు లైసెన్సులున్నాయా? సంబంధిత సర్టిఫికెట్ ఉన్న ఫార్మసిస్టే దుకాణం నిర్వహిస్తున్నారా? మందుల ఇచ్చే వారికి అనుభవం ఉందా? లేదా? తదితర విషయాలపై పూర్తిస్థాయిలో విధిగా తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా అధికారులు మందుల దుకాణాలపై దృష్టి సారించి జరుగుతున్న పొరపాట్లును గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అర్హత, అనుభవం లేని వ్యక్తులు నిర్వహించే మందుల దుకాణాల వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచి ఉంది.

నిబంధనల అమలెక్కడ?

మందుల దుకాణాల్లో ఫార్మసిస్టులు మాత్రమే మందులు ఇవ్వాల్సి ఉంటుంది. దుకాణం నిర్వహిస్తున్న సమయాల్లో ఆయన పర్యవేక్షణలోనే మందుల విక్రయాలు జరగాలి. కానీ సింహభాగం రిటైల్ దుకాణాల్లో ఫార్మసిస్టులు లేరు. పట్టణాల్లోనే ఈ పరిస్థితి కొనసాగుతుంటే ఇక గ్రామాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. గ్రామాల్లో అయితే ఎలాంటి ఫార్మసిస్ట్ ధ్రువపత్రం లేకుండానే మందులు విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇతరుల సర్టిఫికెట్లను అద్దెకు తెచ్చుకుని దుకాణాలను నడుపుతున్నారు. ఎంబీబీఎస్ వైద్యులు సిఫార్సు చేసిన మందుల చీటీ ఆధారంగానే జలుబు, జ్వరం, వంటి చిన్న చిన్న రోగాలకు సైతం మందుల ఇవ్వాలి ఉంటుంది. అయితే ప్రిస్క్రిప్షన్ లేకుండానే చిన్న పిల్లలు వెళ్లి అడిగినా మందు బిళ్లలు ఇచ్చేస్తున్నారు. ఇక దుకాణాల్లో అమ్మే మందుకు



కొనుగోలుదారులకు ఎలాంటి బిల్లులు ఇవ్వడం లేదు. తెచ్చే మందులకు, విక్రయించే మందులకు ఎలాంటి రిజిస్టర్లు అమలు చేయడం లేదు. ఎవరైనా రీయింబర్స్‌మెంట్ కోసం కొనుగోలు చేసేందుకు బిల్లులు అడిగితే ఎమ్మార్పీ ధరలు, దానిపై జీఎస్టీ వేసి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ఏ దుకాణానికి జీఎస్టీ కూడా లేకపోవడం విశేషం.

అర్హతలేని వారిని నియమిస్తే చర్యలు

జిల్లాలోని ప్రతి మెడికల్ షాపులో అర్హత ఉన్న ఫార్మాసిస్టులను మాత్రమే నియమించుకోవాలి. అర్హత లేని వారిని నియమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అలా నియమించారో.. లేదో తెలుసుకోవడానికి పని చేస్తున్న సిబ్బంది పాన్‌కార్డు, బ్యాంకు ఖాతాల వివరాలు అడిగి తెచ్చుకున్నాం. జీతాలు వారి ఖాతాల్లోనే పడాలి. డాక్టర్లు రాసిన ప్రిస్క్రిప్షన్లకు మాత్రమే మందులు ఇవ్వాలి. ప్రజలు కూడా ఇష్టారాజ్యంగా మందులు కొనుగోలు చేసి వాడుకోరాదు. అలా వాడుకుంటే దీర్ఘకాలంలో అనారోగ్య సమస్యలు వస్తాయి. మెడికల్ షాపు వారు అమ్మిన ప్రతి మందుకు బిల్లులు ఇవ్వాలి. ప్రజలు కూడా అడిగి తీసుకోవాలి.

– వీరకుమార్‌రెడ్డి, ఏడీ, జిల్లా ఔషధనియంత్రణ శాఖ

ఐపీఎస్‌తో ఐఏఎస్‌ల ఆత్మీయ భేటీ



ఐపీఎస్ అధికారి కొమ్మి ప్రశాంత్ శివకిశోర్ కుటుంబ సభ్యులతో ఐఏఎస్ అధికారులు సేతు మాధవన్, వికాస్ మర్మత్

ఆత్మకూరురూరల్: ఆత్మకూరుకు చెందిన ఐపీఎస్ అధికారి కొమ్మి ప్రశాంత్ శివకిశోర్‌ను నెల్లూరులోని ఆయన నివాసంలో ఐఏఎస్ అధికారులు జేసీ సేతు మాధవన్, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రకాశ్ శివకిశోర్ తండ్రి కొమ్మి నారాయణ ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా పని చేస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో ఆయన కుమారుడు ప్రశాంత్ శివకిశోర్, కోడలు ఐఏఎస్ అధికారి ధాత్రిరెడ్డి, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 16న ఉద్యోగ విరమణ అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో నెల్లూరుకు చేరుకున్న ఐపీఎస్, ఐఏఎస్ అధికారులు ప్రశాంత్ శివకిశోర్, ధాత్రిరెడ్డి కుటుంబ సభ్యులను కలిసి ముందస్తు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

నెల్లూరు (టౌన్): ఇటీవల జరిగిన ఏపీ ఓపెన్ స్కూల్ పరీక్షల విధుల్లో అలసత్వం వహించిన ఇద్దరు ఉపాధ్యాయులను శుక్రవారం డీఈఓ పీవీజే రామారావు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అల్లూరులోని రామకృష్ణ జూనియర్ కళాశాలలో ఎజ్జీటీగా పని చేస్తున్న వై.శీనమ్మ, ఎఫ్‌బీసీ యూపీ స్కూల్‌లో పని చేస్తున్న స్టాలినాను కావలిలోని పరీక్ష కేంద్రంలో ఇన్విజిలేటర్లుగా నియమించారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో విధుల్లో అలసత్వం ప్రదర్శించడంతో పాటు మాస్ కాపీయింగ్‌కు సహకరించినట్లు జిల్లా అబ్జర్వర్ ప్రసన్న కుమార్ గుర్తించినట్లు డీఈఓ పీవీజే రామారావు తెలిపారు. ఈ విషయంపై సంబంధిత ఇన్విజిలేటర్లను ప్రశ్నించగా సరైన సమాధానం ఇవ్వకపోవడంతో ఉన్నతాధికారులకు నివేదిక అందజేసినట్లు చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

టీడీపీ దాడి బాధితులకు ప్రసన్న పరామర్శ



బాధితులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో నాలుగు రోజుల క్రితం టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన బాధితులను కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారితోనూ, కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ నీచ సంస్కృతికి తెరతీసిందని దుయ్యబట్టారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, చెర్లో సతీష్‌రెడ్డి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అవకతవకల సెక్షన్ 51 విచారణపై శిక్షణ



ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తున్న డీసీఓ గుర్రప్ప

నెల్లూరు (వీఆర్సీసెంటర్): ఆర్థిక అవకతవకలపై ఏపీ సహకార సంఘాల చట్టం 1964 సెక్షన్ 51కి సంబంధించి విచారణ ప్రక్రియపై సహకార సిబ్బందికి శుక్రవారం సహకార ఏపీ రాష్ట్ర సహకార యూనియన్ విజయవాడ, ప్రొద్దుటూరు సహకార క్షేత్రం, జిల్లా సహకార శాఖాధికారి నెల్లూరు ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ద్వారా శిక్షణ నిర్వహించారు. నగరంలోని డీసీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జిల్లా సహకారశాఖాధికారి గుర్రప్ప చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు చెందిన 76 మంది సహకార సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. సహకార సంఘాల్లో జరిగే అవకతవకలు, విచారణ నివేదిక విధానం, సివిల్ ప్రొసీజర్ కోడ్, ఇండియన్ పీనల్ కోడ్, భారతీయ సాక్ష్యాధారాల చట్టం అనుసరించి బకాయి దారుల నుంచి వాగ్మూలం రికార్డ్ చేయడం, చట్టపద్ధతులపై శిక్షణ కార్యక్రమంలో వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార ఆడిట్ అధికారి తిరుపతయ్య, కావలి డివిజనల్ సహకారశాఖాధికారి యలమందయ్య, గూడూరు సహకారశాఖాధికారి రవిరాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలకు సలాం



అత్యధికంగా రక్తదానం చేసిన దాతలను జ్ఞాపికలు, సర్టిఫికెట్లతో సన్మానిస్తున్న రెడ్‌క్రాస్ చైర్మన్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంసీ మెంబర్లు

- రాష్ట్రంలో రక్త సేకరణలో నెల్లూరు రెడ్‌క్రాస్ ఫస్ట్
- త్వరలోనే తలసేమియా ఆస్పత్రి
- రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి
- రక్తదాతలకు ఘన సన్మానం

నెల్లూరు (అర్బన్): క్షతగాత్రులకు, రోగులకు, రక్తహీనతకు గురైన వారికి, ప్రసవ సమయంలో రక్తం అవసరమైన గర్భిణులకు, తలసేమియా జబ్బుతో బాధపడుతున్న చిన్నారులకు అవసరమైనప్పుడల్లా రక్తదానం చేస్తున్న దాతలందరికీ సలాం చేస్తున్నామని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శుక్రవారం నగరంలోని మద్రాస్ బస్టాండ్ వద్ద ఉన్న రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో పలువురు రక్తదానం చేశారు. సాయంత్రం అక్కడ రక్తదాతలకు అభినందన సభ నిర్వహించారు. అత్యధికంగా రక్తదానం చేసిన 58 మంది దాతలకు సర్టిఫికెట్‌లు, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ వందలాది క్యాంపులు నిర్వహిస్తూ వేలాది మంది నుంచి రక్త సేకరణ చేసి అవసరమైన వారికి అందిస్తున్నామన్నారు. నెల్లూరు రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు 16 వేలకు పైగా యూనిట్లు రక్తాన్ని సేకరించి రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా నిలిచిందన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ రెడ్‌క్రాస్ తరఫున అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు.

తలసేమియా ఆస్పత్రికి కృషి

తలసేమియా జబ్బుతో బాధపడుతున్న పిల్లలకు ప్రత్యేకంగా ఆస్పత్రిని నిర్మిస్తున్నామని త్వరలోనే అందుబాటులోకి వస్తుందని చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. బ్లడ్ బ్యాంక్‌ను ఎంతో ఆధునీకీకరించామన్నారు. అత్యంత నాణ్యమైన పరీక్షలు చేస్తూ రోగులకు రక్తాన్ని అందిస్తున్నామన్నారు. రెడ్‌క్రాస్ తరఫున అత్యంత తక్కువ ధరకు రక్త పరీక్షలు ఇక్కడ చేస్తున్నామన్నారు. జనరిక్ మందుల షాపు ద్వారా అతి తక్కువ ధరలకు మందులను అందిస్తున్నామన్నారు. కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను నడుపుతూ పేదలకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత సేవలందిస్తున్నామన్నారు. మానసిక దివ్యాంగులకు శిక్షణలు ఇస్తున్నామన్నారు. ఇలా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఇందుకు ఎంసీ మెంబర్లు, జిల్లా ప్రజలు సహకరించడమే కారణమన్నారు. రెడ్‌క్రాస్ తరఫున సేవలను మరింత విస్తృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంసీ మెంబర్లు, వివిధ విభాగాల కన్వీనర్లు కోటారెడ్డి, సుబ్బారెడ్డి, రాజేంద్ర ప్రసాద్, రంగయ్యనాయుడు, సురేష్‌కుమార్‌జైన్, అజయ్‌బాబు, రవికుమార్, ప్రసాద్ రెడ్డి, తిక్కవరపు సుకుమార్‌రెడ్డి, రక్తదాతలు పాల్గొన్నారు.

అక్రమంగా తెల్లరాయి తరలింపు

- అడ్డుకున్న గ్రామస్తులు



తెల్లరాయి తరలిస్తున్న టిప్పర్లు

ఆత్మకూరు: చేజర్ల మండలంలోని కోటితీర్థం శివార్లలో కొండలను తొలిచి తెల్లరాయిని అక్రమంగా టిప్పర్లలో తరలిస్తుండగా గ్రామస్తులు శుక్రవారం అడ్డుకున్నారు. స్థానికుల కథనం మేరకు.. తెలుగురాయిపురానికి చెందిన ఓ వ్యక్తి గూడూరు, రాపూరు, ఒంగోలు ప్రాంతానికి చెందిన కొందరు కాంట్రాక్టర్లతో కలిసి విలువైన తెల్లరాయిని అక్రమంగా తరలిస్తున్నారు. కొద్దిరోజులుగా ఈ వ్యవహారం జరుగుతోంది. ఇలా చేయొద్దని గ్రామస్తులు వారిని హెచ్చరించినా పట్టించుకోలేదు. కోటితీర్థంతోపాటు చిత్తలూరు, చేజర్ల గ్రామంలోని దేవాదాయ శాఖకు చెందిన భూముల్లో ఈ అక్రమ తవ్వకాలు సాగిస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపించారు. శుక్రవారం అందరూ ఏకమై తెల్లరాయిని తరలిస్తున్న టిప్పర్లను గ్రామ శివార్లలో నిలిపివేశారు. మరికొన్నింటిని చేజర్లలో అడ్డుకున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

టీడీపీలో అంతర్గత ఆధిపత్యం


- పార్టీని బతికించిందే తానంటూ కోటంరెడ్డి ఆత్మస్తుతి
- తన అనుచరులతో పార్టీలో తానే నంబర్ వన్ అంటూ భజనకీర్తన
- పార్టీ జెండా ఆవిష్కరించి మంత్రి నారాయణను అవమానించిన వైనం



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నెల్లూరు టీడీపీలో అంతర్గత ఆధిపత్యం ఆరంభమైంది. పార్టీలో ఏ హోదా లేకపోయినా.. పార్టీ అంటే తాను, తానంటే పార్టీ అంటూ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తనకు తాను గొప్పగా పొగుడుకుంటే.. పార్టీలో కోటంరెడ్డి నంబర్ వన్ అయితే.. రెండో వ్యక్తి నారాయణ, పార్టీని బతికించిన మూడో వ్యక్తి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అంటూ తన అనుచరులతో భజన కీర్తన ఉదంతం ఆ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. రెండు రోజుల క్రితం నెల్లూరు నగరంలోని 14వ డివిజన్ ఏసీనగర్ సెంటర్‌లో టీడీపీ జెండాను కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆవిష్కరించారు. సాధారణంగా పార్టీ జెండా ఆవిష్కరణను ప్రొటోకాల్ ప్రకారం స్థానిక ఎమ్మెల్యే, మంత్రి అయిన నారాయణతో చేయించడం గౌరవనీయం. అయితే పార్టీలో ఏ పదవి లేని కోటంరెడ్డి ఆధిపత్యం చాటుకునేందుకు ఈ కార్యక్రమం చేపట్టడంపై సర్వత్రా చర్చకు దారి తీసింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన మూడో రోజు నుంచే ఆ పార్టీతో యుద్ధం ప్రారంభించానని, మిగతా వారంతా మూడేళ్ల తర్వాత ప్రజాక్షేత్రంలోకి వచ్చారంటూ పరోక్షంగా నారాయణపై విమర్శలు గుప్పించారు. ఈ రోజు నెల్లూరు సిటీలో పార్టీ బతికిందంటే తన వల్లేనంటూ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి చెప్పుకొచ్చారు. తన రాజకీయ భవిష్యత్ కొందరి వల్ల లేకుండా పోయిందని, తన జీవితమంతా ఒకరికి పల్లకిలు మోసే బతుకైందంటూ వాపోయారు. ఓ వైపు నెల్లూరు సిటీ ఎమ్మెల్యే, మంత్రి పొంగూరు నారాయణపై అక్కసు వెళ్లగక్కుతూనే మరో వైపు ఆయన్ను సిటీని అభివృద్ధి చేసిన గొప్ప నాయకుడంటూ కీర్తించడం కొసమెరుపు. ఇదే సమయంలో అదే డివిజన్ ఇన్‌చార్జి నేత మాట్లాడుతూ నెల్లూరు నగరంలో టీడీపీ నేతలంటే నంబర్ వన్ కోటంరెడ్డి అయితే.. నారాయణ రెండో వ్యక్తిగా, వేమిరెడ్డి మూడో వ్యక్తిగా అభివర్ణించాడు. ఈ కార్యక్రమం ద్వారా తనను తాను పొగుడుకోవడం, తన అనుచరులతో కీర్తించుకోవడం కోసమే కాకుండా.. నెల్లూరు నగరంలో తన ఆధిపత్యం చాటుకునే ప్రయత్నమే అనే సందేశాన్ని పంపారని ఆ పార్టీలోనే చర్చ జరుగుతోంది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కోటంరెడ్డితో పాటు టీడీపీకి చెందిన డివిజన్ ఇన్‌చార్జిలను నారాయణ పక్కన పెట్టేశారు. వారికి ఏ విధంగా సంబంధం లేకుండానే తన సొంత యంత్రాంగంతో ఎన్నికలను నిర్వహించుకున్నారనే అక్కసును ఈ విధంగా వెలిబుచ్చుతున్నారని ఆ పార్టీ కేడర్ చెవులు కొరుక్కోవడం విశేషం.

వ్యాధుల కాలం.. జాగ్రత్త

తొలకరి వర్షాలు కురుస్తున్నాయి. పల్లెలు, పట్టణాల్లోని పల్లపు ప్రదేశాల్లో, గుంతల్లో నీరు చేరుతోంది. దోమలు వృద్ధి చెందుతున్నాయి. తాగునీరు కలుషితమవుతోంది. దీంతో సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, టైఫాయిడ్ కేసులు విజృంభిస్తున్నాయి. సాధారణ జ్వరాలు అక్కడక్కడా పెరుగుతున్నాయి. ప్రజలు సీజనల్ వ్యాధులపై అవగాహన పెంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు.



- సీజనల్ వ్యాధులతో ఇబ్బందులు
- తగిన జాగ్రత్తలు తీసుకుంటే రక్షణ
- దోమల నిర్మూలనతో డెంగీ, మలేరియా, ఫైలేరియా దూరం
- కలుషిత నీరు తాగొద్దు
- ఇప్పటికే 500కి పైగా టైఫాయిడ్ కేసుల నమోదు

నెల్లూరు(అర్బన్): వ్యాధుల సీజన్ మొదలైంది. నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో జ్వరాల కేసులు ఇప్పుడిప్పుడే పెరుగుతున్నాయి. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. ప్రధానంగా నగరంలోని డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల, జయభారత్ ఆస్పత్రి తదితర చోట్ల రోగుల సంఖ్య పెరిగింది. ఇటీవల ముత్తుకూరు మండలంలోని ఓ గ్రామంలో డయేరియా, జ్వరపీడితుల సంఖ్య ఎక్కువగా నమోదైంది. ఆత్మకూరు, కావలి, కోవూరు తదితర ప్రాంతాల్లో పలువురు రోగాల బారినపడి ఇబ్బంది పడుతున్నారు.

ఇటీవల వరకు

జిల్లాలో 52 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 28 పట్టణ ఆరోగ్య కేంద్రాలున్నాయి. ఆత్మకూరులో ఒక జిల్లా ఆస్పత్రి, కావలి, కందుకూరులో ఏరియా ఆస్పత్రులు, నెల్లూరు నగరంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రులున్నాయి. ఇటీవల వరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించింది. ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు చొప్పున డాక్టర్లను, ఇంకా పూర్తిస్థాయిలో పారామెడికల్ స్టాఫ్‌ను నియమించింది. రోగులకు అవసరమైన అన్ని రకాల మందులను, రక్తపరీక్షలను, ఈసీజీ, స్కానింగ్ తదితర వాటిని అందుబాటులోకి తెచ్చింది. ల్యాబ్‌లలో 70 రకాల పరీక్షలను ఉచితంగా చేయించింది.

కారణాలివి

సీజనల్ వ్యాధులకు అనేక కారణాలున్నాయి. దోమ కుట్టినప్పుడు వాటి లాలాజలంలో ఉన్న సూక్ష్మజీవులు మనిషి రక్తంలోకి ప్రవేశించి జబ్బులు కలుగచేస్తాయి. దోమల వల్ల ప్రధానంగా డెంగీ, చికున్‌గన్యా, మలేరియా, మెదడువాపు, ఫైలేరియా (బోధకాలు) వస్తాయి. అలాగే తాగు నీరు, ఆహారం కలుషితం కావడం వల్ల టైఫాయిడ్, విరేచనాలు, కామెర్ల బారిన పడుతారు. నీటితోపాటు ఆహారం కలుషితం వల్ల వచ్చే ప్రధానమైన జబ్బు అతిసారా (నీళ్ల విరేచనాలు). ఒక్కో దఫా వాంతులు ఎక్కువగా అవుతాయి. ఫలితంగా శరీరంలోని నీరు పోయి మనిషి నీరసించిపోతాడు. ప్రాణాల మీదకు వస్తుంది. విరేచనాలకు గురైతే తక్షణమే ఎలక్ట్రాల్ పౌడర్ కలిపిన నీరు తాగాలి. మజ్జిగ, కొబ్బరి నీళ్లు తీసుకుంటే మంచిది. సమీపంలోని ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలి.

జిల్లాలో ఇదీ పరిస్థితి

వైద్యశాఖ లెక్కల ప్రకారం గత సీజన్‌లో 116 డెంగీ కేసులు, నాలుగు మలేరియా కేసులు నమోదయ్యాయి. ఈ సీజన్‌లో ఇప్పటికే 20 డెంగీ కేసులు నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. ఇంకా జిల్లాలో 500కి పైగా టైఫాయిడ్ కేసులు నమోదైనట్లు ఐఎంఏ అసోసియేషన్ నాయకులు అంచనా వేశారు. జిల్లాలోని 450 ప్రైవేట్ హాస్పిటళ్లలో డెంగీ, మలేరియా కేసులు సుమారు 500కి పైగా నమోదైన వైద్యశాఖ అధికారులు వీటిని పరిగణనలోకి తీసుకోలేదు. అనుమానాస్పద కేసులుగానే పరిగణిస్తున్నారు. ప్రైవేట్ వైద్యశాలల్లో డెంగీకి సంబంధించి ర్యాపిడ్ కిట్ల ద్వారా పరీక్షలు చేస్తే వాటిని లెక్కల్లోంచి తీసేస్తున్నారు. ఎలీసా పరీక్ష పద్ధతిలో చేసినప్పుడు పాజిటివ్ వస్తేనే డెంగీగా నిర్ధారిస్తున్నారు. ఈ తరహా టెస్టులను ప్రభుత్వ పెద్దాస్పత్రిలో చేస్తున్నారు.



నెల్లూరు దర్గామిట్టలోని ప్రభుత్వాస్పత్రిలో ఓపీ కోసం వచ్చిన వారు

డెంగీ జ్వరం

ఏడిస్‌ఈజిప్టి అనే దోమ కాటు ద్వారా డెంగీ జ్వరం వస్తుంది. తీవ్రమైన తలనొప్పితోపాటు నొసట నొప్పి రావొచ్చు. కండరాలు, కీళ్లనొప్పులు వస్తాయి. నోరు ఎండిపోవడం, వాంతి వచ్చినట్లు ఉంటుంది. చర్మంపై కందినట్టు ఎర్రటి మచ్చలు రావచ్చు. కొందరికి రక్తంలో ప్లేట్‌లెట్లు తగ్గిపోతాయి. ఇలాంటి వారిని తక్షణమే ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించాలి.

యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశాం



జిల్లాలో ఇంకా సీజనల్ వ్యాధులు ప్రబలలేదు. ఇవి వ్యాప్తి చెందకుండా ముందస్తు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశాం. డాక్టర్లను అప్రమత్తం చేశాం. అనుమానాస్పదంగా ఉన్న జ్వరపీడితులకు డెంగీ, మలేరియా లాంటి పరీక్షలు చేయాలని ఆదేశాలు జారీ చేశాం. జ్వరం, వాంతులు, విరేచనాలు, కామెర్లకు సొంత వైద్యం చేసుకోకుండా సమీప ప్రభుత్వాస్పత్రిలో డాక్టర్‌ను కలవాలి.

– పెంచలయ్య, డీఎంహెచ్‌ఓ

దోమల నిర్మూలనకు చర్యలు



సీజనల్ వ్యాధులు ఎక్కువగా దోమల వల్ల వస్తున్నందున వాటి నిర్మూలనకు ప్రజలు సహకరించాలి. దోమలు కుట్టకుండా, పుట్టకుండా చూసుకోవాలి. తమ పరిసరాల్లో నీటి గుంతలు లేకుండా చూసుకోవాలి. ఒకవేళ ఉన్నా వాటిల్లో ఆయిల్‌బాల్స్ వేయాలి. ఇంటి పరిసరాల్లో పాత టైర్లు, కొబ్బరి బోండాలు, రుబ్బురోళ్లు తదితర వాటిలో కొంచెం నీరున్నా దోమలు గుడ్లు పెడుతాయి. అందువల్ల అలాంటి వాటిని లేకుండా చూసుకోవాలి. ఫ్రైడేను డ్రైడేగా పాటించి వారానికి ఒక దఫా ప్రజలు తమ నీటి తొట్టెలను, క్యాన్లను క్లీన్ చేసుకుని ఎండబెట్టాలి.

– ఎం.హుస్సేనమ్మ, జిల్లా మలేరియా నివారణ అధికారిణి

టైఫాయిడ్

తాగేనీరు, ఆహారం కలుషితం అవడం వల్ల సాల్మోనెల్లా టైపి అనే బ్యాక్టీరియా వల్ల టైఫాయిడ్ వస్తుంది. ఆకలి తగ్గిపోతుంది. జ్వరం వస్తూ.. తగ్గుతూ ఉంటుంది. మూడు రోజుల తర్వాత రక్తపరీక్షలు చేయించుకుంటే టైఫాయిడ్‌గా తెలుస్తుంది. డాక్టర్ పర్యవేక్షణలో మందులు వాడుతూ తగిన విశ్రాంతి తీసుకుంటే తగ్గిపోతుంది.

కామెర్లు

వర్షాకాలంలో ఎక్కువగా సోకే వ్యాధి పచ్చ కామెర్లు. కలుషితమైన నీరు, ఆహారం వల్ల కామెర్లు వస్తాయి. మద్యం అలవాటున్న వారికి సైతం ఈ వ్యాధి వస్తుంది. సూక్ష్మ జీవులు శరీరంలోని కాలేయాన్ని కేంద్రంగా చేసుకుని జబ్బును కలిగిస్తాయి. ఆకలి మందగిస్తుంది. కళ్లు పచ్చగా మారుతాయి. వెంటనే డాక్టర్ వద్దకు వెళ్లి చికిత్స చేయించుకోవాలి. ఈ జబ్బు వచ్చిన వారికి మూడువారాల విశ్రాంతి అవసరం.

క్లుప్తంగా

రైల్లో నుంచి జారి పడి..

- గుర్తుతెలియని వ్యక్తి మృతి



సూళ్లూరుపేట: సూళ్లూరుపేట రైల్వే స్టేషన్‌లో నెల్లూరు నుంచి చెన్నై వెళ్లే మెము రైలును ఎక్కుతూ ఓ గుర్తుతెలియని వ్యక్తి ప్రమాదవశాత్తూ జారిపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. మృతుడి వయస్సు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉంటుందని రైల్వే పోలీసులు తెలిపారు. అతడికి రెండు కాళ్లు, రెండు చేతులకు బలమైన గాయాలు కావడంతో వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. మృతుడు మెరూన్ కలర్, బ్లాక్ మీద సన్నటి తెలుపురంగు చారలతో కూడిన గళ్ల చొక్కా ధరించి ఉన్నాడు. మెడలో నల్లటి తాడు ఉంది. ఆచూకీ తెలిస్తే తమను సంప్రదించాలని, లేకుంటే మున్సిపాలిటీ వారికి అప్పగించి ఖననం చేయిస్తామని రైల్వే పోలీసులు శుక్రవారం తెలిపారు.

బాలమందిరంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(అలిపిరి): ఎస్వీ బాలమందిరంలో 2024 – 25 విద్యా సంవత్సరానికి అనాథ బాలబాలికల ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు టీటీడీ డీఈఓ డాక్టర్ భాస్కర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. హిందువులై 2024 జూన్ 15 నాటికి 5 – 10 ఏళ్ల లోపు వయసు కలిగి తల్లిదండ్రులు లేని అనాథ బాలబాలికలను చేర్చేందుకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. జనన, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలతో జూలై 5వ తేదీ లోపు స్వయంగా లేదా తపాలాలో దరఖాస్తులను 'ఏఈఓ, ఎస్వీ బాలమందిరం, టీటీడీ, భవానీ నగర్, తిరుపతి –517501' చిరునామాకు పంపాలన్నారు. వివరాలకు ఫోన్ నంబర్ 0877 – 2264613ను సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి



డ్రైవర్ శ్రీనివాసులు



నాగరాజు మృతదేహం

సంగం: నెల్లూరు నుంచి దినపత్రికలను తరలించే టాటా మ్యాజిక్ వాహనం రోడ్డుకు అడ్డుగా వచ్చిన గేదెలను ఢీకొంది. దీంతో డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తి మృతిచెందారు. ఈ ఘటన శుక్రవారం తెల్లవారుజామున మండలంలోని నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై దువ్వూరు వద్ద జరిగింది. ఈ ప్రమాదంలో రెండు గేదెలు చనిపోయాయి. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం వెంకటేశ్వరపురం జనార్దనరెడ్డి కాలనీకి చెందిన శ్రీనివాసులు (57) తన వాహనంలో రోజూ ఓ దినపత్రిక ప్రతులను సంగం, ఆత్మకూరు, ఉదయగిరి, సీతారామపురం ప్రాంతాలకు తరలిస్తుంటారు. శుక్రవారం తెల్లవారుజామున పేపర్ లోడుతో వాహనం బయలుదేరింది. నెల్లూరు రైల్వేస్టేషన్ వద్ద సంగం మండలం పడమటిపాళెం మజరా శంకర వీరరాఘవపురంలో నివాసముంటున్న నాగరాజు (50) అతని కుమార్తె ప్రశాంతికుమారి, మనుమరాలు చరిష్మా అందులో ఎక్కారు. మండలంలోని దువ్వూరు వద్దకు వచ్చే సరికి ఒక్కసారిగా రోడ్డుకు అడ్డంగా గేదెలు రావడంతో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ పక్క సీట్లో ఉన్న నాగరాజు అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీనివాసులు తీవ్రంగా గాయపడి వాహనంలో ఇరుక్కుపోయాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న వారు సంగం పోలీసులకు సమాచారం ఇచ్చారు. శ్రీనివాసులును బయటకు తీసి హైవే మొబైల్ వాహనంలో నెల్లూరుకు తరలిస్తుండగా చనిపోయాడు. ఆయన మృతదేహాన్ని నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వెనుక సీట్లో కూర్చొని ఉన్న ప్రశాంతికుమారి, చరిష్మా సైతం గాయపడ్డారు. వారికి ప్రథమ చికిత్స చేయించారు. ప్రశాంతికుమారి గర్భిణి. కైకలూరులో ఉంటున్న ఆమె, చరిష్మా రైల్లో నెల్లూరులో దిగారు. నాగరాజుతో కలిసి శంకరవీరరాఘవపురం వెళ్లేందుకు వాహనం ఎక్కారు. సంగం పోలీసులు దెబ్బతిన్న టాటా మ్యాజిక్‌ను పక్కకు తరలించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. శుక్రవారం నాగరాజు, శ్రీనివాసులు మృతదేహాలకు పోస్టుమార్టం చేయించి కుటుంబసభ్యులకు అప్పగించారు. సంగం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా గస్తీ ముమ్మరం



బీట్ బుక్‌ను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ హుస్సేన్‌బాషా



కావలి మండలం చెన్నాయపాలెంలో ప్రజలతో మాట్లాడుతున్న పోలీస్

నెల్లూరు (క్రైమ్): బీట్ వ్యవస్థను పటిష్టం చేయడంతోపాటు నేరస్తులపై ఉక్కుపాదం మోపాలని, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఆదేశించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు గురువారం నుంచి గస్తీని ముమ్మరం చేశారు. రాత్రి విధుల్లో ఉన్న అధికారులు బీట్‌లను పరిశీలించి నేర నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలను సిబ్బందికి వివరించారు. శివారు ప్రాంతాలు, నేరాలు అధికంగా జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. సమస్యాత్మక ప్రాంతాల్లోని ప్రజలతో సమావేశాలు నిర్వహించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించరాదని సూచిస్తున్నారు. రాత్రివేళల్లో తాళాలు వేసిన ఇళ్లు, రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్లు, ఆలయాలు, బ్యాంకులు, ఏటీఎంలు, నిర్మానుష్య ప్రదేశాల్లో గస్తీని ముమ్మరం చేయాలని ఎస్పీ చెప్పారు. స్టేషన్ పరిధిలో నేరచరిత్ర కలిగిన రౌడీషీటర్లు, సస్పెక్టెడ్‌ల కదలికలపై రాత్రి గస్తీ సిబ్బంది నిఘా ఉంచాలన్నారు. రోజూ రాత్రి వారిని తనిఖీ చేసి సదరు వివరాలను బీట్ బుక్‌లో నమోదు చేయాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకుని వేలిముద్రలను సేకరించి పోలీసు డేటాబేస్‌లో పరిశీలించాలన్నారు. అందులో ఎలాంటి నేరాలు లేనట్లు తేలితే వారి వివరాలను నమోదు చేసుకుని వదిలివేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణా కట్టడి చర్యల్లో భాగంగా వాహన తనిఖీలు చేపట్టాలన్నారు. రాత్రి వేళ తిరిగే ఆకతాయిలు, మద్యం మత్తులో వాహనాలు నడిపే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నేరనియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు తీసుకుంటున్న చర్యలకు ప్రజలు సహకరించాలన్నారు. తమ పరిధిలో ఏవైనా సమస్యలుంటే స్థానిక పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లి చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలన్నారు.

సిద్ధిలేశ్వరకోన వద్ద హెచ్చరిక బోర్డులు




రాపూరు: రాపూరు–చిట్వేలి మార్గంలో వెలుగొండ అటవీ ప్రాంతంలోని సిద్ధిలేశ్వరకోన వద్ద పలు చోట్ల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కోన జలపాతంలో మునగవద్దని, అక్కడి నీటి గుంతలో గుండాలు, పాకుడు పట్టిన పెద్ద రాళ్లు ప్రమాదకరంగా ఉన్నట్లు బోర్డుల్లో పేర్కొన్నారు. గత పదేళ్లలో ఈ జలపాతంలో మునిగి సుమారు 18 మంది యువకులు మృత్యువాత పడ్డారని బోర్డులో ప్రకటించారు. సరదా కోసం ప్రాణాల మీదకు తెచ్చుకుని కుటుంబీకులకు విషాదం మిగల్చవద్దని పోలీసులు, పంగిలి పంచాయతీ అధికారులు సూచించారు.

కండలేరులో 6.467 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 6.467 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 20, లోలెవల్ కాలువకు 40 క్యూసెక్కుల వంతున నీరు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.65
సన్నవి	: రూ.40
పండ్లు	: రూ.30



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 157
లేయర్ (లైవ్)	: 120
బ్రాయిలర్ చికెన్	: 276
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 306
లేయర్ చికెన్	: 204



